ప్రజా నాయకుడు సీఎం జగన్



61వ వార్డులో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్



58వ వార్డులో లబ్ధిదారులకు కరపత్రాలు అందిస్తున్న సమన్వయకర్త ఆడారి

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- 61, 58 వార్డుల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'

మల్కాపురం: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా గుండెల్లో పెట్టుకున్నారని ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 61వ వార్డు ప్రకాష్‌నగర్, ప్రియదర్శిని కాలనీల్లో శుక్రవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ ఆయన వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బ్రోచర్లు పంపిణీ చేశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ అమ్మ ఒడి, విద్యా కానుక, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న విదేశీ విద్య వంటి అనేక పథకాలు, కార్యక్రమాల ద్వారా విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు సీఎం వైఎస్ జగన్ భరోసా కల్పించారని పేర్కొన్నారు. మహిళలు, రైతులు, మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీ ఇలా అన్ని వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారని కొనియాడారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. సీఎం జగన్ చేస్తున్న మేలును గుర్తుపెట్టుకొని వచ్చే ఎన్నికల్లో ఆయనను ప్రజలంతా మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొణతాల సుధ, పార్టీ నాయకులు జీవీఎస్ఎన్ రాజు(కేబుల్ వాసు), భోగవల్లి నాగభూషణం, సోనూ, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

జీవీఎంసీ 58వ వార్డు ములగాడలో శుక్రవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ములగాడ సచివాలయం పరిధిలో లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలని కోరారు. తన పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 96 శాతానికి పైగా నిలబెట్టుకున్న గొప్ప వ్యక్తి జగనన్న అని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గులిగిందల లావణ్య, నాయకులు పెద్దాడ వెంకటరమణ, వేణుగోపాల్‌రెడ్డి, తోనంగి వెంకటరమణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ఇండస్ట్రియల్ కాలనీలో రూ.7.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ వార్డులోని పలు ప్రాంతాల్లో సుమారు రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే వార్డు కార్పొరేటర్ సుధ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో కేబుల్ వాసు, భోగవల్లి నాగభూషణం, అనుదీప్, కొల్లి నూకరెడ్డి, దాసరి రవి, విజయ్‌కుమార్, బాలు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనంపై పడిన వృక్షం తొలగింపు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెం గెడ్డ పక్కన ఉన్న రజక సామాజిక భవనంపై గురువారం రాత్రి కూలిన వృక్షం తొలగించే పనులు చేపట్టారు. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు ఈ వృక్షం భవనంపై కూలింది. దీంతో భవనం పాక్షికంగా దెబ్బతింది. వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య శుక్రవారం ఆ ప్రాంతానికి వెళ్లి ప్రైవేట్ సిబ్బంది సాయంతో అక్కడ కూలిన వృక్షాన్ని తొలగించే పనులను చేపట్టారు. కార్యక్రమంలో వార్డు పార్టీ అధ్యక్షుడు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు, విత్తనాలు నాటిన విద్యార్థులు



హైస్కూల్ ప్రాంగణంలో విత్తనాలు నాటుతున్న విద్యార్థులు

గోపాలపట్నం: విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు జేడీ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం గోపాలపట్నం హైస్కూల్ లో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో కాయగూరలు మొక్కలు నాటించారు. వంగ, టమాట, మిర్చి, కాలీఫ్లవర్, మునగ వంటి మొక్కలు, విత్తనాలతోపాటు తోటకూర, పాలకూర, కొత్తిమీర వంటి ఆకుకూరలు నాటారు. వాటి సంరక్షణ బాధ్యతను విద్యార్థులకు అప్పగించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, నేషనల్ గ్రీన్ కార్ప్స్ జిల్లా కోఆర్డినేటర్ బాబూరావు మాస్టార్, పిన్నమనేని శ్రీనివాస్, జేడీ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద చేపట్టిన నిరవధిక దీక్షలు శుక్రవారానికి 25వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన వారికి అన్యాయం చేయడం సరికాదన్నారు. కొవిరి అప్పలరాజు, వాసుపల్లి ఎల్లాజీ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

గోపాలపట్నం: డెంగ్యూ, మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా విభాగం సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ అన్నారు. ఎన్ఏడీ జంక్షన్ రోడ్డులో ఉన్న ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత – సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. డెంగ్యూ, మలేరియా మంచినీటిలో పెరిగే దోమల వల్ల వస్తాయన్నారు. వారానికో రోజు డ్రైడే పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో నోడల్ అధికారి నగశ్రీను, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందుబాటులోకి తేవాలి

జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్



వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాల రైతులకు సాంకేతికత అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ అధికారులను కోరారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాలు, ఎరువులు రైతులకు ఆర్బీకేల ద్వారా అందుబాటులో ఉంచాలన్నారు. వరి కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా సక్రమ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. దీనివల్ల రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఉంటుందన్నారు. కౌలు రైతులకు పంట రుణాలు రెన్యువల్ చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని బ్యాంకు అధికారులను కోరారు. ఇటీవల అధిక వర్షాల వల్ల ముంపునకు గురై నష్టం వాటిల్లిన వరినారు సమాచారం ప్రభుత్వానికి నివేదిక పంపించాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డీవీఏ ప్రసాద్‌రాజు మాట్లాడుతూ భూసార పరిస్థితులను బట్టి అధిక దిగుబడినిచ్చే పంటలను, పాడి, మత్స్య పరిశ్రమలకు సంబంధించి సూచనలు అందించాలన్నారు. ప్రభుత్వం అందించే రాయితీ రైతులకు ఆర్బీకే కేంద్రాల ద్వారా వర్తించేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి మండల, గ్రామస్థాయిలో చర్చించిన విషయాలు జాయింట్ కలెక్టర్‌కు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. పశు సంవర్ధక, ఉద్యానవన, పట్టు, ఇతర అనుబంధ శాఖలు, పౌరసరఫరాల అధికారులు చేపడుతున్న అభివృద్ధి పథకాల గురించి వివరించారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ జేడీ రామకృష్ణ , లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, పౌరసరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ రాజేశ్వరి, ఉద్యానవన శాఖ అధికారి మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

గౌతంరెడ్డిని కలిసిన ట్రేడ్ యూనియన్ నాయకులు



గౌతంరెడ్డిని సత్కరిస్తున్న బద్రీనాథ్, సురేష్‌యాదవ్

మల్కాపురం: వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతంరెడ్డి పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శుక్రవారం నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, పారిశ్రామిక ప్రాంత ట్రేడ్ యూనియన్ నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం పారిశ్రామిక ప్రాంతంలోని పలు పరిశ్రమల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బద్రీనాథ్ సారథ్యంలో గౌతంరెడ్డిని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ 63వ వార్డు ఇన్‌చార్జ్ పీలక రామ్మోహన్‌రెడ్డి, ఖాన్, భూపతి, వరహాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గోపాలపట్నం: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. పాస్ పోర్టు కార్యాలయం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న ప్రమాదంపై కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్‌అండ్ బీ జంక్షన్ నుంచి వస్తున్న సిల్వర్ కలర్ స్కార్పియో అదే దిశలో వెళ్తున్న ద్విచక్రవాహనదారుడిని వెనుక నుంచి ఢీకొట్టడంతో ఎగిరి పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇది చూసిన స్థానికులు ఢీకొట్టిన స్కార్పియోను వెంబడించినా ఆపకుండా వెళ్లి పోయాడు. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు, ఎయిర్ పోర్టు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని 108లో కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన వ్యక్తి గోపాలపట్నం ఇందిరానగర్ చెందిన వాడని చూసిన వారు చెబుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

'స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేస్తే సహించం'



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా, అన్నింటినీ ఎదుర్కొంటామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 897వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం అమ్మాలనే ఆలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు, కార్మికులు వచ్చే ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్తారన్నారు. ఎందరో కార్మికుల బలిదానాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం దుర్మార్గమన్నారు. వెంటనే విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందనే ప్రకటనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

31న భారీ నిరసన..: ఉక్కు దీక్షలు చేపట్టి 900 రోజులు గడుస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 31న దీక్ష శిబిరం వద్ద చేపట్టనున్న భారీ నిరసన కార్యక్రమంలో నిర్వాసితులు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. దీనికి విశేష స్పందన లభించినట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. లలితా జ్యూవెల్లరీ మార్ట్, కల్యాణ్ జ్యూవెల్లర్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, స్పందన స్ఫూర్తి, ఫైనాన్షియల్, హానర్ ల్యాబ్స్, హెటిరో డ్రగ్స్, యాక్సిస్ బ్యాంక్, టీమ్ లీజ్, ఎస్‌బీఐ అండ్ ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్, పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 535 ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 415 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 161 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. వారి సర్టిఫికెట్లను పరిశీలించి, అభ్యర్థులకు సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడంతో వాటిల్లో నేరుగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తోందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎ.సంగీత, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో హరిత నగరాలు



మొక్కలు నాటుతున్న జియ్యాని శ్రీధర్, బీఎస్ కృష్ణ, ఏడీహెచ్ దామోదర్

గోపాలపట్నం: జీవీఎంసీ పరిధిలో మొక్కలు విరిగా నాటి హరిత నగరాలు తయారు చేద్దామని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పిలుపునిచ్చారు. జగనన్న హరిత నగరాలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జీవీఎంసీ 52వ వార్డు పరిధి జిందాల్ భవనం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. జీవీఎంసీ పరిధిలో 98 వార్డుల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. ఏడీహెచ్ దామోదర్, జిందాల్ భవన్ అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ, జియ్యాని మారుతి, ఆర్‌పీలు, మహిళలు పాల్గొని మొక్కలు నాటారు.

మహిళలపై హింసను అరికట్టాలి



నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

మల్కాపురం: దేశంలో పలు చోట్ల మహిళలపై హింస రోజు రోజుకూ అధికమవుతుందని అయినా ప్రభుత్వాలు మౌనం వహిస్తున్నాయని ఐద్వా నాయకురాలు బి.ప్రభావతి ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులను వ్యతిరేకిస్తూ 58వ వార్డు గుల్లలపాలెం వద్ద శుక్రవారం మహిళా పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ మత్తు మాఫియా దేశాన్ని ఏలుతుందని ఆరోపించారు. మత్తుకు అలవాటు పడ్డ కొంత మంది యువకులు అమ్మాయిలపై దాడులకు పాల్పడి అమానవీయంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కళాకారులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఐద్వా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



గ్రంథాలయాధికారి నరసింహంకు పుస్తకాలు అందిస్తున్న ఆళ్ల అప్పారావు

గోపాలపట్నం: గోపాలపట్నం శాఖా గ్రంథాలయానికి విశ్రాంత అధ్యాపకుడు, రచయిత ఆళ్ల అప్పారావు తన స్వీయ రచనలతో పాటు తెలుగు, ఆంగ్ల పుస్తకాలను శుక్రవారం గ్రంథాలయ అధికారి ఎన్‌వీ నరసింహంకు అందించా రు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ పుస్తకాలు విజ్ఞానాన్ని అందించే సాధనాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ పాఠకులు వర్మ, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల విధుల బహిష్కరణ

- కనీస వేతనాల కోసం వడ్లపూడి వేగన్ రిపేర్ వర్క్‌షాప్ ఎదుట ఆందోళన

అక్కిరెడ్డిపాలెం: ప్రస్తుతం చెల్లిస్తున్న కనీస వేతనాలైనా సక్రమంగా చెల్లించాలని కోరుతూ ఆటోనగర్ ఎఫ్–బ్లాక్, చుక్కవానిపాలెం రైల్వే గేటు వద్ద గల వడ్లపూడి వేగన్ రిపేర్ వర్క్‌షాప్ (రైల్వే స్పేర్‌పార్ట్స్ రిపేర్ కంపెనీ) కార్మికులు షాప్ ఎదుట ఆందోళన నిర్వహించారు. కార్మికులు శుక్రవారం విధులను బహిష్కరించారు. ఆందోళనలో పాల్గొన్న రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.నరసింహ మాట్లాడుతూ వడ్లపూడి రైల్వే స్పేర్‌పార్ట్స్ కార్మికులు రోజుకు 12 గంటలు పని చేస్తున్నారని, ప్రభుత్వాలు అమలు చేసిన వేతనాలు చెల్లించడం లేదని దుయ్యబట్టారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, భద్రతా నియమాలు అమలు చేయడం లేదన్నారు. రైల్వే స్పేర్‌పార్ట్స్ కంపెనీ కాలర్ కార్మికుల ప్రధాన కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై యాజమాన్యానికి ఎన్నిమార్లు వినతిపత్రాలు అందజేసినా పరిష్కారం కావడం లేదన్నారు. వర్క్‌షాప్‌లో కంపెనీ కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి 15 రోజుల్లోగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా దువ్వాడ పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు.

ప్రమాదభరితం..!

- వెలగని లైట్లు.. వేలాడుతున్న వైర్లు
- అంధకారంలో వీధులు
- పట్టించుకోని విద్యుత్ అధికారులు



గొల్లకంచరపాలెంలో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



గౌరీనగర్‌లో విద్యుత్ లైట్లు వెలగక చీకట్లు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధిలో విద్యుత్ స్తంభాలు ప్రమాదభరితంగా మారాయి. వీధిలైట్ల నిర్వహణను గాలికొదిలేశారు. రామ్మూర్తిపంతులుపేట, గవర కంచరపాలెం, తోట వీధి, గౌరీనగర్, గొల్లకంచరపాలెం ప్రాంతాల్లో చీకట్లు రాజ్యమేలుతున్నాయి. కరెంట్ స్తంభాలకు లైట్లు లేకపోవడం, మరికొన్ని చోట్ల పనిచేయకపోవడంతో వీధుల్లో అంధకారం నెలకొంది. ఇటీవల కురిసిన వర్షాలు, ఈదురు గాలులకు విద్యుత్ లైట్లు వైర్లు తెగిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో చీకట్లు కనిపిస్తున్నాయి. రాత్రి వేళ రాకపోకలు సాగిస్తున్న వారు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గొల్లకంచరపాలెం శ్రీకృష్ణ మందిరం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకొని ఉన్న స్తంభం వద్ద ప్రమాదకరంగా కట్‌ఔట్ వైర్లు వేలాడుతున్నాయి. ఇక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు, పాదచారులు ఆందోళన చెందుతున్నారు. గౌరీనగర్‌లో నెల రోజులుగా లైట్లు వెలగడం లేదని ఆరోపిస్తున్నారు. 44బీ/7/2 నుంచి 9/3 వరకు గల విద్యుత్ స్తంభాలకు లైట్లు పనిచేయడం లేదు. విద్యుత్ దీపాల సమస్యపై జీవీఎంసీ విద్యుత్ విభాగానికి, ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభాలపై ఏపీఈపీడీసీఎల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంతాలవాసులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మర్యాదపూర్వక కలయిక



కోలా గురువులును సత్కరిస్తున్న స్టాండింగ్ కమిటీ సభ్యురాలు పూర్ణిమ

కంచరపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన కోలా గురువులును శుక్రవారం 41వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ పార్టీ కార్యాలయంలో కలిసి శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు గురువులుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్, వేళంగిణీ రావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో బెహరా కళాశాల ప్రిన్సిపాల్ ఇందుమతి, అధ్యాపకులు

గోపాలపట్నం: నరవ బెహరా నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. హృదయ శ్వాసకోశ పునరుజ్జీవన చర్య(కార్డియా పల్మనరీ రిససిటేషన్) సీపీఆర్ చేసే విధానాన్ని విద్యార్థులకు నేర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఇందుమతి మాట్లాడుతూ అబ్దుల్ కలామ్ సీపీఆర్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఇండియన్ రిససిటేషన్ కౌన్సిల్ ఫెడరేషన్ ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి 28 వరకు వారోత్సవాలు నిర్వహిచామని తెలిపారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌కు సీపీఆర్ చేసి ఉంటే బతికేవారని అన్నారు. వ్యక్తికి గుండె కొట్టు కోవడం ఆగినపుడు చేసే అత్యవసర చర్యను సీపీఆర్ అంటారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అనూషప్రియ, విద్యశ్రీ, అధ్యాపకులు నీరజ, రిచా, గ్రేసి, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచినీటి బావుల్లో గంబూషియా చేపల విడుదల



బావిలోకి గంబూషియా చేపలు వదులుతున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో డెంగ్యూ, మలేరియా కారక దోమల వ్యాప్తిని అరికట్టేందుకు గంబూషియా చేపలను శుక్రవారం వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు మంచినీటి బావుల్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధుల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డ్రైడే–ఫ్రైడేపై ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పరుచుకుని ప్రతి శుక్రవారం, మంగళవారం ఇంట్లో అత్యవసరానికి కావాల్సిన నీటిని ఉంచుకుని, మిగిలిన నీటి పాత్రలను ఖాళీ చేయాలన్నారు. కార్యక్రమంలో మల్కాపురం మలేరియా ఇన్‌స్పెక్టర్ డి. రవికుమార్, హెల్త్ అసిస్టెంట్ రోమాల వేణుబాబు, సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, వి.విజయకుమారి, మలేరియా సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది, సచివాయల సిబ్బంది, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వే స్థలంలో చెత్త తొలగింపు



గోపాలపట్నం రైల్వే స్టేషన్ ప్రాంతంలో శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

గోపాలపట్నం: గోపాలపట్నం రైల్వే స్టేషన్ స్థలాల్లో పేరుకు పోయిన చెత్తను 92వ వార్డు పారిశుధ్య కార్మికులు శుక్రవారం తొలగించారు. జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వస్తున్న నేపథ్యంలో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, ఎస్ఎస్ వెంకటరమణ, సచివాలయ కార్యదర్శులు శుభ, గోపిపనులు పర్యవేక్షించారు. అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్ దమ్ము శ్రీనివాసరావు, డీవీ రమణ సిబ్బంది పాల్గొన్నారు.

'తెలుగు ప్రశ్నపత్రంలో నూతన విధానం రద్దు చేయాలి'

గోపాలపట్నం: తెలుగు ప్రశ్న పత్రంలో చేస్తున్న మార్పులను రద్దు చేయాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ విశాఖపట్నం ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దయానంద్, రామునాయుడు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పద్యానికి ప్రతిపదార్థం, భావం రాయడాన్ని తొలగించడం సరికాదన్నారు. ఈ విధానం కొనసాగితే విద్యార్థులు పద్యం చదవడం మానేస్తారని వాపోయారు. విద్యార్థులు పద్యం చదవక పోతే అందులోని మాధుర్యం ఎలా అర్థమవుతుందన్నారు. తెలుగు భాషలో మాత్రమే ఉన్న ప్రక్రియ పద్యమేనని పేర్కొన్నారు. పద్యం లేకుండా పదోతరగతి పశ్న పత్రం ఇవ్వడం అసంబద్ధమన్నారు. ఈ అంశంపై పునరాలోచించాలని.. పద్యం ప్రతిపదార్థం కొనసాగించాలని కోరారు.